పాఠశాలల్లో 'విజిలెన్స్' తనిఖీలు

చిలమత్తూరు : ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పలు పాఠశాలల్లో విజిలెన్స్ అధికారులు శుక్రవారం తనిఖీలు చేశారు. జిల్లా విజిలెన్స్ అధికారులు యోగేష్ బాబు, ఫణీంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో చిలమత్తూరు మండలంలోని కొడికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తనిఖీ చేశారు. జగనన్న గోరుముద్దలో భాగంగా అందజేస్తున్న కోడిగుడ్లు, చిక్కీలను పరిశీలించారు. మధ్యాహ్న బోజనం తనిఖీ చేసి, రికార్డులను పరిశీలన చేశారు. కాగ తనిఖీల విషయం పాత్రికేయులకు తెలియకుండా గోప్యంగా ఉంచారు. తనిఖీల సమయంలో విలేకరులను పిలవకుండా, తరువాత విజిలెన్స్ అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారంటూ మండల విద్యాశాఖ అధికారులు పత్రిక ప్రకటన విడుదల చేయడంపై పలు అనుమనాలు వ్యక్తం అవుతన్నాయి. ఈ కార్యక్రమంలో ఎంఇఒ నాగరాజు నాయక్, ప్రధానోపాధ్యాయులు పద్మావతమ్మ ఉన్నారు. ఇక అనంతపురం జిల్లా పరిధిలోని అనంతపురం రూరల్ మండలం పాంపంపేట జెడ్పీ పాఠశాలలోనూ తనిఖీలు చేశారు. ఇక్కడ గుడ్ల పరిణామం తక్కువగా ఉన్నట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం.

గుత్తి రైల్వే బైపాస్ లైన్ ప్రారంభం

- రూ.43 కోట్లతో 3.02 కిలో మీటర్ల కొత్త లైన్
- పలు ప్రాంతాలకు రాకపోకలు సులభతరం
- ప్రయాణికులకు సమయం ఆదా

ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాలో కీలకమైన గుత్తి రైల్వే జంక్షన్‌లో కొత్తగా ఏర్పాటైన బైపాస్ లైన్‌ను శుక్రవారం నుంచి ప్రారంభించారు. దీని ద్వారా గుత్తిలో ఇప్పటి వరకు రైళ్ల రివర్స్ సమస్యకు పరిష్కారం లభించినట్టయింది. ఇంజన్ మార్పు సమయం ఆదా అవడం ద్వారా రాకపోకల్లో కొంత సమయం ఆదా అయ్యే వీలు కలుగుతుంది. 3.2 కిలోమీటర్ల మేర రూపొందించిన బైపాస్ లైన్ రూ.43 కోట్ల విలువతో చేపట్టారు. ఈ రైల్వేలైన్ నిర్మాణంతో గుత్తి -ధర్మవరం, గుత్తి-రేణిగుంట లైన్ల మధ్య రాకపోకలు ఇక సులభతరం కానున్నాయి. ఈ జంక్షన్ నుంచి బెంగళూరు, రేణిగుంట, డోన్, గుంతకల్లు, వాడి వైపు ప్రయాణికుల రైళ్లతోపాటు సరుకు రవాణా రైళ్లు ప్రయాణిస్తూ ఉంటాయి. దక్షిణం వైపు ధర్మవరం, రేణిగుంట వైపు వెళ్లే రైళ్లు ఖచ్చితంగా ఆపి రివర్సల్ చేసుకుని వెళ్లాల్సి వచ్చేది. ఇందుకు చాలా సమయం పట్టేది. ఇప్పుడు ఈ బైపాస్ నిర్మాణం వల్ల సమయంఆదా అవనుంది. ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ వ్యవస్థతో గుత్తి దక్షిణం వద్ద క్యాబిన్, గుత్తి జంక్షన్ వద్ద మరో క్యాబిన్ ఉన్నాయి. నూతనంగా నిర్మించిన బైపాస్ లైన్ జంక్షన్ క్యాబిన్ దగ్గర మొదలవుతుంది. గుత్తి జంక్షన్ క్యాబిన్ ఇప్పుడు గుత్తి జంక్షన్ బైపాస్ క్యాబిన్‌గా వ్యవహరించబడుతుంది. దీనికి అనుగుణంగా క్యాబిన్‌ను రూపొందించి ఇప్పటికే ఉన్న మార్గ్‌ను అనుసంధానం చేశారు. బైపాస్ లైన్ గుత్తి పట్టణ పక్కనే ఉన్నందున రైలు ప్రయాణికుల రాకపోకలకూ సులభతరం చేయడానికి హైలెవల్ హాల్ట్ ప్లాట్‌ఫామ్‌ను ఏర్పాటు చేశారు.

గుత్తిలో నూతన బైపాస్ రైల్వే ట్రాక్

కొత్త బైపాస్‌లైన్ ప్రారంభంతో ప్రయోజనాలు

- ధర్మవరం వైపు నుంచి రేణిగుంట వైపు వెళ్లే రైళ్లకు అంతరాయం లేకుండా నిరంతరాయంగా రాకపోకలు సాగించవచ్చు.
- సరుకు రవాణా వెళ్లే రైళ్లు నేరుగా వెళ్లేందుకు వీలు కలుగుతుంది. తద్వారా ప్రయాణికులతో వెళ్లే రైళ్లకు ఆటంకాలుండవు. సెక్షన్ సామార్థ్యాన్ని పెంచేందుకు వీలు పడుతుంది.
- రైళ్లు సగటు వేగం పెంచేందుకూ ఉపయోగపడుతుంది.
- రవాణా వ్యవస్థ వృద్ధితో పాటు రోలింగ్ స్టాక్(కోచ్‌లు, వ్యాగన్)ల వినియోగాన్ని మెరుగు పరుస్తుంది.

సకాలంలో పూర్తి చేసిన సిబ్బందికి జిఎం అభినందన

ముఖ్యమైన బైపాస్ లైన్‌కు అవసరమైన మార్పులతో సకాలంలో పూర్తి చేసిన సిబ్బందిని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ అభినందినట్టు దక్షిణ మధ్య రైల్వే పిఆర్ఒ రాకేశ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ బైపాస్ నిర్మాణం పూర్తి చేయడం వలన కడప, నెల్లూరు జిల్లాల్లో ఉన్న థర్మల్ పవర్‌ప్లాంట్, కృష్ణపట్నం ఓడరేవు, సిమెంటు పరిశ్రమలకు సరుకు రవాణాను సులభతరం చేయనున్నట్టు జనరల్ మేనేజర్ తెలిపారు. ఈ పనులను సకాలంలో పూర్తి చేయడంలో కృషిచేసిన ఇంజినీర్లు, కాంట్రాక్టర్‌ను అభినందించారు.

దళితుల శ్మశాన స్థలాలకు రక్షణ కరువు

- కోడుమూరు గ్రామంలో ఆక్రమణను అడ్డుకోండి
- సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

పజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో భూ ఆక్రమణలు, ఆన్‌లైన్‌లో అక్రమంగా నమోదు చేసుకోవడం దళితుల శ్మశాన స్థలాలను ఆక్రమించుకోవడం లాంటి ఘటనలు ఇటీవల అధికం అవుతున్నాయని అధికారులు వీటిపై స్పందించి చర్యలు తీసుకోవాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. యల్లనూరు మండలం కోడుమూరు గ్రామం, గుంతకల్లు మండలం కసాపురం గ్రామం, రాప్తాడు మండలం గాండ్లపర్తి గ్రామాల్లో ఎస్సీల శ్మశాన స్థలాలను ఆక్రమించుకున్న ఘటనలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలన్నారు. ఆక్రమణల్లో ఉన్న స్థలాలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దళితుల శ్మశాన స్థలాల సమస్యలపై తహశీల్దార్ కార్యాలయాల్లో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించాలని కోరారు. యల్లనూరు మండలం కోడుమూర్తి గ్రామంలో ఇటీవల 2.50 ఎకరాల ఎస్సీల శ్మశాన స్థలాన్ని అధికార పార్టీకి చెందిన వారు ఆక్రమించకుని చదును చేశారన్నారు. దీనిపై గ్రామ దళితులు మండలం నుంచి జిల్లా రెవెన్యూ అధికారుల వరకు వినతిపత్రాలు అందజేశారన్నారు. అయినా అధికారులు స్పందించిన దాఖలాలు లేవన్నారు. ఆ భూమి రికార్డు ప్రకారం కూడా ఎస్సీల శ్మశానానికి కేటాయించినట్లు ఉన్నప్పటికీ దౌర్జన్యంగా ఆక్రమించుకుంటున్నారని తెలిపారు. యథేచ్ఛగా ఆక్రమణ జరుగుతున్నా అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఇదే పరిస్థితి యల్లనూరు మండలంలోని తిరుమలాపురం, మల్లెపల్లి, గుంతకల్లు మండలం కసాపురం, రాప్తాడు మండలం గాండ్లపర్తితో పాటు పలు గ్రామాల్లో ఉందన్నారు. దీనిపై అధికారులు స్పందించి దళితుల శ్మశాన స్థలాలు ఆక్రమణకు గురికాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. ఇక ఉరవకొండ మండలం రాకెట్ల గ్రామంలో ఎస్టీల పట్టాసాగు భూమిలో బలవంతంగా రోడ్డు వేయాలని పోలీసుల ద్వారా రెవెన్యూ, ఆర్అండ్‌బి అధికారులు ప్రయత్నించడం సరికాదన్నారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న కెవిపిఎస్ నాయకులు

కెవిపిఎస్ నిరసన

శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి స్పందించి కోడుమూర్తి గ్రామ దళితుల స్మశాన స్థలాన్ని కాపాడాలని కోరుతూ కెవిపిఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం అనంతపురం నగరంలోని జెడ్పీ కార్యాలయం ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు జి.వెంకటేష్ మాట్లాడుతూ కోడుమూర్తి గ్రామ సర్వేనెంబర్ 69- బిలో ఏళ్ల తరబడి ఎస్సీలకు శ్మశాన స్థలం ఉందన్నారు. దీనినిఆక్రమించుకుని దహన సంస్కారాలు కాకుండా ఆటంకం చేస్తున్న వారిపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 1235 ప్రకారం ప్రతి దళితవాడకీ రెండు ఎకరాల శ్మశాన స్థలం కేటాయించి దానికి మౌలిక సదుపాయాలు కల్పించాలని ఉన్నప్పటికీ, జిల్లాలో అనేక గ్రామాల్లో ఇది అమలుకు నోచుకోలేదన్నారు. కోడుమూర్తి గ్రామంలోని దళితులకు ప్రస్తుతం ఉన్న శ్మశాన స్థలం యథావిధిగా కొనసాగించే విధంగా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు రాజా, ఓబయ్య, ఆకులప్ప, శివయ్య, నగర నాయకులు నల్లప్ప, నరసింహులు, వన్నూరప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్ రద్దు దుర్మార్గం

- కేంద్ర ప్రభుత్వం నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి
- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సూర్యచంద్ర యాదవ్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ప్రీ-మెట్రిక్ స్కాలర్‌ప్‌ను రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అత్యంత దుర్మార్గం అని, తక్షణం దీనిని ఉపసంహరించుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సూర్యచంద్రయాదవ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర యాదవ్ మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరం నుంచి 8వ తరగతిలోపు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఈబీసీ పేద విద్యార్థులకు ఇచ్చే స్కాలర్‌షిప్‌లను ఇవ్వబోమని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రకటించడం సరికాదన్నారు. తక్షణమే ఈ ప్రకటనను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేద విద్యార్థులకు ఇస్తున్న స్కాలర్‌షిప్‌లు వారి చదువుకు ఉపశమనంగా ఉంటాయన్నారు. ఉచిత నిర్బంధ విద్యను సాకుగా చూపి కేవలం 9,10 తరగతుల విద్యార్థులకే ఈ స్కాలర్‌షిపులను పరిమితం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. దీని వల్ల ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఈబీసీ విద్యార్థులు చదువులకు దూరమై డ్రాపౌట్స్ పెరిగే ప్రమాదం ఉందన్నారు. దేశం 100 శాతం అక్షరాస్యత సాధించాలని ఒకవైపు చెబుతూనే ఇలాంటి ప్రమాదకర నిబంధనలు తేవడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. తక్షణమే ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అశోక్‌కుమార్, సంపత్, అనిల్‌కుమార్ నాయక్, నవీన్‌కుమార్, సందీప్, మహేష్ పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పారిశ్రామిక రుణాల ద్వారా అభివృద్ధి

- జిల్లా పరిశ్రమల శాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగరాజారావు

ప్రజాశక్తి-ఉరవకొండ

అర్హులైన లబ్ధిదారులకు పారిశ్రామిక రుణాలు మంజూరు చేసి అభివృద్ధి పాటుపడదామని జిల్లా పరిశ్రమల శాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగరాజారావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఉరవకొండ ఎంపిడిఒ కార్యాలయంలో జిల్లా పారిశ్రామిక అభివృద్ధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రజలు ఉపయోగకరంగా ఉండే ఎలాంటి పరిశ్రమలు ఏర్పాటు చేయాలోనే అంశాలపై గ్రామస్థాయిలో సంబంధిత అధికారులు అవగాహన సదస్సుల ద్వారా చైతన్యం కలిగించాలన్నారు. లబ్ధిదారులకు పారిశ్రామిక రుణాలు ఇవ్వడానికి సంబంధిత బ్యాంక్ అధికారులు కూడా సహకరించి పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేయడానికి భాగస్వాములు కావాలన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేయడం ద్వారా అనేక మందికి జీవనోపాధి కల్పించినట్లు ఉంటుందన్నారు. ఆర్థిక అసమానతలు తొలగడానికి అవకాశం ఉంటుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పారిశ్రామిక రంగాలపై ప్రత్యేక దష్టి సారించాయని అందులో భాగంగా స్టాండ్ ఆఫ్ ఇండియా, పిఎంఇజిపి ముద్రలోన్, ఫుడ్ ప్రాసెసింగ్ స్కీములకు, వెహికల్ లోన్ లాంటివి ఉన్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్ని రకాల లోన్‌ల పైనా సబ్సిడీ ఉంటుందన్నారు. వివిధ రకాల లోన్లకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు లోన్‌లు మంజూరు చేయడంలో అన్ని శాఖల బ్యాంకు అధికారులు సహకరించి పారిశ్రామిక అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ ఏడీ రాజశేఖర్‌రెడ్డి, టెక్స్‌టైల్స్ హ్యాండ్లూమ్ అధికారి బసవరాజు, ఖాదీశాఖ అధికారి ఐజయ్య, ఫుడ్ ప్రాసెసింగ్ జిల్లా అధికారి రఘునాథ్ రెడ్డి, డిఐఎ జిల్లా ప్రెసిడెంట్ గోపాల్, ఎంపీపీ చంద్రమ్మ, జెడ్పిటిసి పార్వతమ్మ, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా పరిశ్రమల శాఖ డిప్యూటీ డైరెక్టరు నాగరాజారావు

సంక్షేమాన్ని రెట్టింపు చేస్తానంటే నమ్మేదెవరు?

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అనంత

ప్రజాశక్తి -అనంతపురం

తాను అధికారంలోకి వస్తే సంక్షేమాన్ని రెట్టింపు చేస్తానని చంద్రబాబు చెబుతున్న మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని తమ ప్రభుత్వం ఎన్నడూ లేని విధంగా సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. అధికారం కోసం చంద్రబాబు పడుతున్న ఆరాటం చూసి 'ఇదేం ఖర్మ' అని జనం అనుకుంటున్నట్లు చెప్పారు. శుక్రవారం ఎ.నారాయణపురం పంచాయతీలో గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ స్థానికంగా నెలకొన్న సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించాలని అధికారులు ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనంత మాట్లాడుతూ గతంలో ఎన్నడూ ఇంతలా సంక్షేమ పథకాలు అమలు చేసిన పరిస్థితి లేదన్నారు. సంక్షేమం, అభివద్ధిని రెండు కళ్లుగా భావించి ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఓ వైపు ప్రజలు సంతోషంగా ఉంటే ప్రతిపక్ష టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నేతలు తమ రాజకీయ మనుగడ కోసం కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజాసంక్షేమం పట్ల చంద్రబాబుకు చిత్తశుద్ధి లేదన్నారు. చంద్రబాబు చెప్పినట్లు రానున్న ఎన్నికలే ఆయనకు, ఆ పార్టీకి చివరి ఎన్నికలని అన్నారు. కార్యక్రమంలో మేయర్ మహమ్మద్ వసీం, జెడ్పీటీసీ చంద్ర, ఎంపీపీ వరలక్ష్మి, ఎంపీటీసీలు నాగేంద్ర, శృతి, స్థానిక వైసీపీ నాయకులు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, వేణు, సత్తెన్న, పురుషోత్తంరెడ్డి, రామాంజినేయరెడ్డి, పెద్ద లక్ష్మినారాయణ, మాబు, హాజీవలి. బి.మదన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి : సిపిఎం

పత్తిపంటను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి-పుట్లూరు

ఖరీఫ్‌లో పత్తి పంట సాగుచేసి దిగుబడులు రాక నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం రైతు సంఘం నాయకులు పుట్లూరు మండలంలోని చింతకుంట, కందికాపుల, పుట్లూరు, గ్రామాలలో రైతులు సాగుచేసిన పత్తి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రైతులు అప్పులు చేసి పత్తిపంటను సాగుచేశారన్నారు. అధిక వర్షాలకు దిగుబడులు రాక రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. వ్యవసాయ అధికారులు గ్రామాల్లో పర్యటించి పత్తి పంటలను పరిశీలించాలన్నారు. నష్ట నివేదికను ప్రభుత్వానికి పంపాలన్నారు. ప్రభుత్వం పత్తి రైతులకు ఎకరాకు రూ.50 వేలు పంట నష్టపరిహారం, ఇన్సూరెన్స్ ఇవ్వాలన్నారు. నకిలీ, నాసిరకం పత్తి విత్తనాలు అమ్మి రైతులను మోసం చేసిన కంపెనీలపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం జరిగే వరకూ వారికి అండగా రైతు సంఘం పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు విటి.రామాంజినేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.సూరి, రైతు సంఘం మండల కార్యదర్శి గుత్తా వెంకట చౌదరి, రైతులు నాగార్జునరెడ్డి, నాగేశ్వరరెడ్డి, విజయలక్ష్మి, కె.చంద్రుడు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణపై సమావేశం

ప్రజాశక్తి గుత్తి

మున్సిపల్ కార్యాలయంలోని సభ మందిరంలో శుక్రవారం ఓటరు జాబితా సవరణపై మున్సిపల్ కమిషనర్ బివి.నరసారెడ్డి, తహసిల్దార్ ఎస్.మహబూబ్ బాషా లు బిఎల్ఓ లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్, తహసిల్దార్ మాట్లాడుతూ ఓటరు డేటా విచారణ, సవరణలు ప్రక్రియ వారం రోజుల లోపు పూర్తిచేయాలని మున్సిపాలిటీ బూత్ స్థాయి అధికారులకు ఆదేశించారు.

కమిషనర్‌ను సన్మానిస్తున్న కార్మికునలు

కమిషనర్‌కు సన్మానం

అనంతపురం కార్పొరేషన్ : అనంతపురం నగరపాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మిని సిఐటియు అనుబంధ మున్సిపల్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు మాట్లాడుతూ.. నగరంలో 25 సంవత్సరాలుగా గార్బేజ్ కార్మికులు ఇంటింటా చెత్త సేకరణ చేస్తూ ఇంటి యజమానులు నెలకు ఇచ్చే రూ.10, రూ.20తో ఇప్పటివరకు కుటుంబాలను పోషిస్తూ వస్తున్నారన్నారు. సిఐటియు అనుబంధ మున్సిపల్ యూనియన్ పోరాటాల ఫలితంగా నగరపాలక సంస్థ పాలకవర్గం, అధికారులు గార్బేజ్ కార్మికులకు కాలువల పూడికతీత ఉపాధి పనులను కల్పించారన్నారు. మొదటిసారిగా వేతనం అందుకున్న కార్మికులు హర్షం వ్యక్తం చేస్తూ కమిషనర్ భాగ్యలక్ష్మిని సత్కరించారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు నాగరాజు, జిల్లా మహిళా కన్వీనర్ లక్ష్మీనరసమ్మ, నగర అధ్యక్షులు బండారు ఎర్రిస్వామి, ఉపాధ్యక్షులు శేషేంద్ర కుమార్, నగర కమిటీ సభ్యులు బంగ్లా రాఘవ, శేఖర్ బాబు, లక్ష్మీదేవి, మరియమ్మ శాలువ కప్పి సన్మానించారు.

CHANGE OF NAME

I, ALISHARE ZAMEERAHMED S/0 ALISHARE MASTHAN VALI , (Residing at D.No. 24-334 A , GOUSULWARA STREET, OLD TOWN , NEAR BUDDAPPA SCHOOL , ANANTAPUR-515001. (A.P.) hereby states that my name & father name is mentioned Wrongly and printed in **(PASSPORT NO. J0235715)** as **ALISHER ZAMEERAHMED**, S/0 **ALISHER MASTHAN VALI** instead of **ALISHARE ZAMEER AHMED** S/0 **ALISHARE MASTHAN VALI** Henceforth I am being known and called as **ALISHARE ZAMEER AHMED** S/0 **ALISHARE MASTHAN VALI*** for all purposes.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE:GOOTY.
SUCCESSION O.P.No.07/2022

Between:
ShaiK Nazeer Ahamed ... **Petitioner**
AND
Nil ...**Respondent**

ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా, పై అర్జీదారుడు అనగా షేక్ నజీర్ అహమద్ గారి తల్లిగారైన Smt.Poppur Beebi W/o Late.Noor Ahamed, S.C.Railways నందు HKA/CHI/O/ Guntakal (PF No.05536290) గా పనిచేయుచూ మరణించినందున ఆమెకు రావలసిన Death Benefits రూ.17,45,682/-లకు గాను వారసుడని మరియు SUCCESSION CERTIFICATE ను మంజూరు చేయవలయునని పై కోర్టులో అర్జీని దాఖలు చేసుకొనినారు. సదరు కోర్టు వారు S.O.P.No.07/2022 తేది. 16-12-2022కు వాయిదా వేసినారు. కావున ఎవరికైన సదరు అర్జీపై ఆక్షేపణలున్న యెడల పై కోర్టులో 16-12-2022వ తేది హాజరై తెలుపుకొనవలయును.

(By order of the court)
S.EDURU VALI
Advocate For Petitioner, Cell:99481114369

మహారాజశ్రీ అనంతపురం మూడవ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు అనంతపురం.
O.S.NO:922/2022

Between:
1. జి.కృష్ణారెడ్డి
2. జి వెంకటనారాయణ ...వాదులు

ఎదరి

మచ్చా కాంతమ్మ ...ప్రతివాది

ప్రతివాదికి సమన్లు

శ్రీమతి మచ్చా కాంతమ్మ భర్త వీరస్వామి వయసు 70 సంవత్సరాలు సైదాపురం గ్రామము కదిరి మండలం, శ్రీ సత్యసాయి జిల్లా.

ఇందుమూలంగా ప్రతివాది అయిన నీకు తెలియజేయడమేమనగా పై కోర్టు పై కేసులో మీకు పలుమార్లు సమన్లు పంపిన చేరునందున ఈ ప్రకటన ద్వారా మీకు సమన్లు జారీ చేయమని ఆదేశించి పై కేసు 13-12-2022న తేదీన మీ హాజరు నిమిత్తం వాయిదా వేసి ఉన్నారు. కావున మీరు సదరు తేదీనాడు ఉదయం 10:30 గంటలకు మీరు స్వయంగా గానీ, లేక వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షంగా తీర్మానించబడును.

(కోర్టు వారి ఆదేశాల మేరకు)

వాయిదా తేది: 13-12-2022

యం.సురేష్ కుమార్, అడ్వకేట్
14బి 353 కమలానగర్
అనంతపురం-515001
సెల్ నెంబర్:9441168233

మహారాజశ్రీ ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో:అనంతపురం
O.S.NO:493/2020.

Between:
కె.పార్వతి, ఎ.ఉమాదేవి, ఎ.శ్రీనివాస రెడ్డి ...వాది

ఎదరి

దేశాయ్ రెడ్డి మహేష్ రెడ్డి మరియు ఇతరులు ...ప్రతివాదులు

1వ ప్రతివాదికి నోటీసు

D2: దేశాయ్ రెడ్డి మహేష్ రెడ్డి, తండ్రి డి.చిన్న కృష్ణ రెడ్డి వయసు 37 సం॥రాలు, మొబైల్ నెంబర్ 7995249001, ఇటుకలపల్లి విలేజ్, చియ్యేడు పోస్టు, ఆకుతోటపల్లి పంచాయతి, అనంతపురము రూరల్ అండ్ మండల్ జిల్లా.

ఇందుమూలముగా 1వ ప్రతివాది అయిన మీకు తెలియజేయడమేమనగా, పై కోర్టు వారు పై కేసులో మీకు పలు మార్లు నోటీసులు పంపిననూ చేరనందున ఈ ప్రకటన ద్వారా మీకు నోటీసు జారీ చేయమని ఆదేశించి పై కేసును 22-12-2022వ తేదికి మీ హాజరు నిమిత్తం వాయిదా వేసియున్నారు. కావున మీరు సదరు తేదినాడు ఉదయం 10:00 గంటలకు ఖుద్దున గానీ, వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపకొనవలెను. లేనంతట పై కేసు మీ పరోక్షమున తీర్మానించబడును అని తెలిజేయడమైనది.

(కోర్టు వారి ఆదేశాల మేరకు)

వాయిదా: 22/12/2022

వి.నరశింహుడు,
వి.యల్.కామేశ్వరి,
వాదిపరం న్యాయవాదులు, అనంతపురం

మహారాజశ్రీ ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో:అనంతపురం
I.A.No.725/2020 in O.S.NO:493/2020.

Between:
కె.పార్వతి, ఎ.ఉమాదేవి, ఎ.శ్రీనివాస రెడ్డి ...వాది

ఎదరి

దేశాయ్ రెడ్డి మహేష్ రెడ్డి మరియు ఇతరులు ...ప్రతివాదులు

1వ ప్రతివాదికి నోటీసు

D2: దేశాయ్ రెడ్డి మహేష్ రెడ్డి, తండ్రి డి.చిన్న కృష్ణ రెడ్డి వయసు 37 సం॥రాలు, మొబైల్ నెంబర్ 7995249001, ఇటుకలపల్లి విలేజ్, చియ్యేడు పోస్టు, ఆకుతోటపల్లి పంచాయతి, అనంతపురము రూరల్ అండ్ మండల్ జిల్లా.

ఇందుమూలముగా 1వ ప్రతివాది అయిన మీకు తెలియజేయడమేమనగా, పై కోర్టు వారు పై కేసులో మీకు పలు మార్లు నోటీసులు పంపిననూ చేరనందున ఈ ప్రకటన ద్వారా మీకు నోటీసు జారీ చేయమని ఆదేశించి పై కేసును 22-12-2022వ తేదికి మీ హాజరు నిమిత్తం వాయిదా వేసియున్నారు. కావున మీరు సదరు తేదినాడు ఉదయం 10:00 గంటలకు ఖుద్దున గానీ, వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపకొనవలెను. లేనంతట పై కేసు మీ పరోక్షమున తీర్మానించబడును అని తెలిజేయడమైనది.

(కోర్టు వారి ఆదేశాల మేరకు)

వాయిదా: 22/12/2022

వి.నరశింహుడు,
వి.యల్.కామేశ్వరి,
వాదిపరం న్యాయవాదులు, అనంతపురం

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-గుత్తి

అసంఘటితరంగాల్లో పనిచేయుచున్న వేలాది మంది భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సిఐటియు మండల కార్యదర్శి వి.నిర్మల డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఉప తహశీల్దార్ శ్రీలతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వి.నిర్మల మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు. గత ప్రభుత్వాలు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి రూ.830 కోట్లు కేటాయించిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ నిధులను అమ్మ ఒడి పథకానికి మళ్లించి భవన నిర్మాణ కార్మికులకు తీరని అన్యాయం చేస్తోందన్నారు. అందులో భాగంగానే వివిధ ఉపాధి పథకాల్లో పనిచేయుచున్న కూలీలకు కనీస గిట్టుబాటు లభించడం లేదన్నారు. ప్రభుత్వాల చర్యల కారణంగా అసంఘటితరంగ కార్మికుల కుటుంబాలు వీధిన పడ్డాయన్నారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలోని జెడ్.వీరారెడ్డి కాలనీలో మౌలిక వసతులు కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ సచివాలయ ఉద్యోగులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బి.రామకృష్ణ, కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎస్.మున్ని, రామయ్య, ఐద్వా మండల అధ్యక్షురాలు ఎన్.కవిత, భవన నిర్మాణ కార్మికులు సావిత్రి, సుజాత, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

కార్యకర్తలే నాకు రక్షణ కవచం

టిడిపి ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్

వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేశవ్

ప్రజాశక్తి-బెలుగుప్ప

'కార్యకర్తలే నాకు రక్షణ కవచం' అని ఉరవకొండ టిడిపి ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ అన్నారు. ఇటీవల ఆయనకు గన్‌మెన్‌ను తొలగించిన విషయం విధితమే. శుక్రవారం బెలుగుప్ప మండలం ఆవులన్న గ్రామంలో ఉత్తర అమెరికా తెలుగు సంఘం ట్రస్ట్ ఫౌండేషన్ సహకారంతో రూ.7.50 లక్షలు వెచ్చించి మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ హాజరై వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను ఆదుకోవడంలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. 10 ఎకరాలు ఉన్న రైతులకు రేషన్‌కార్డు, పింఛన్లు కూడా తొలగించారని విమర్శించారు. బోరుబావుల కింద పంట సాగుచేసిన రైతులకు డ్రిప్పు పరికరాలు అందించలేదన్నారు. ప్రతి రైతుకూ డ్రిప్పు పరికరాలు అందించిన ఘనత టిడిపి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. జీడిపల్లి రిజర్వాయర్ నుండి చెరువులకు నీళ్లు అందించి అన్నివిధాల రైతులను ఆదుకున్నామని గుర్తుచేశారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లయినా బెలుగుప్ప మండలంలోని చెరువులకు నీరు అందించలేదని విమర్శించారు. ఎప్పుడూ తనను విమర్శించడం తప్ప అభివృద్ధి చేసింది శూన్యం అన్నారు. ఇప్పటికైనా విమర్శలు మాని అభివృద్ధికి బాటలు వేయాలని వైసీపీ నాయకులకు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఉత్తర అమెరికా తెలుగు సంఘం ట్రస్ట్ ఫౌండేషన్‌కు చెందిన అంజయ్య చౌదరి, పురుషోత్తం చౌదరి, రవి, సునీల్, సర్పంచి రామ్మోహన్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

8న వ్యకాసం రాష్ట్ర మహాసభలు

బుక్కరాయసముద్రంలో పోస్టర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో ఈనెల 8, 9, 10 తేదీలలో జరుగు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. శుక్రవారం బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని అంబేద్కర్ సర్కిల్ నందు మహాసభలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ..ఈ మహాసభలకు ఆల్ ఇండియా నాయకులు బృందా కరత్, ఆలిండియా అధ్యక్ష, కార్యదర్శులు బి.వెంకట్, విజయ రాఘవన్ హాజరవుతారని తెలిపారు. వ్యవసాయ కార్మికులు, ఉపాధి హామీ కూలీలు, బడుగు బలహీన వర్గాల సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై ఈ మహాసభల్లో చర్చిస్తారని చెప్పారు. వ్యవసాయ కార్మికులు, కూలీలు, బడుగు బలహీన వర్గాల వారు ఈ మహాసభల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు పుల్లయ్య, నాగలింగయ్య, నాయకులు రఫీ, రైతు సంఘం జిల్లా నాయకులు కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి రూరల్ : వ్యవసాయ కార్మిక సంఘం 29వ మహాసభల పోస్టర్లను స్థానిక సిపిఐ కాలనీలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు సూరి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ మెంబర్ మోహన్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం సభ్యులు లక్ష్మీదేవి, రాములమ్మ, లక్ష్మీకాంతమ్మ, నారాయణమ్మ, అలివేలి, నాగవేణి, యశోదమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమం కోసం పనిచేద్దాం

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

రైతుల సంక్షేమం కోసం సమిష్టిగా పనిచేయాలని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో శుక్రవారం నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం జరిగింది. ఎంపీ తలారి రంగయ్య, జిల్లా పరిషత్ చైర్పర్సన్ గిరిజమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి మార్కెట్ యార్డ్ గౌరవ అధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా భోజరాజు నాయక్, వైస్ ఛైర్మన్‌గా శ్రీనివాస్, సభ్యులతో మార్కెట్ కమిటీ కార్యదర్శి సునీత ప్రమాణ స్వీకారం చేయించారు. విప్ కాపు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ నూతన పాలకవర్గం రైతులకు అవసరమైన, అనుకూలమైన నిర్ణయాలను తీసుకొని రైతు సంక్షేమం కోసం దృష్టి సారించాలన్నారు. టిడిపి వారు చేసే దుష్ప్రచారాలను, దుర్మార్గాలను ఇకపై సహించబోనని హెచ్చరించారు. 2024 ఎన్నికల్లో టిడిపి నామరూపాలు లేకుండా పోతుందన్నారు. అనంతపురం ఎంపీ రంగయ్య మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సమచితం స్థానం కల్పించిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ గిరిజమ్మ మాట్లాడుతూ జగన్ మోహన్‌రెడ్డి బీసీల పక్షపాతి అని అన్నారు. వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య మాట్లాడుతూ కష్టపడిన కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శి గౌని ఉపేందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, వైసిపి నాయకులు నాగరాజురెడ్డి, ఆర్‌టి కాంతారెడ్డి, కొత్తపల్లి సత్తి, రాజేందర్‌రెడ్డి, బోర్వెల్ నాగిరెడ్డి, సుధాకర్‌రెడ్డి మెచ్చిరి చంద్ర, నారాయణ నాయక్, వైసీపీ మండల కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణస్వీకారం చేస్తున్న మార్కెట్ యార్డు పాలకవర్గం

వైసిపి పాలనలో పెచ్చుమీరిన అరాచకం

మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు

బొమ్మనహాల్ మండలం నేమకల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-బొమ్మనహాల్

వైసిపి పాలనకు చరమగీతం పాడాలని మాజీ ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ప్రజలకు పిలుపునిచ్చారు. బొమ్మనహాల్ మండలంలోని నేమకల్లు గ్రామంలో ఇదేమి కర్మ కార్యక్రమాన్ని మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు శుక్రవారం ప్రారంభించారు. స్థానిక ఆంజనేయస్వామి ఆలయం నుండి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కాలవ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని 20 సంవత్సరాలు వెనక్కి తీసుకెళ్లాడని ఆరోపించారు. రాష్ట్రంలో ఎక్కడా ఒక్క అభివృద్ధి పని కూడా చేపట్టలేదన్నారు. రాబోవు రోజుల్లో వైసిపికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బలరామిరెడ్డి, రైతు సంఘం ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, సొసైటీ మాజీ ప్రెసిడెంట్ మల్లికార్జున, మాజీ జెడ్పీ ఛైర్మన్ పూల నాగరాజు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, రైతులు పాల్గొన్నారు.

అనంతపురం : నగరంలోని 9, 10 డివిజన్లలో మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైసిపి దుర్మార్గ పాలనలో పేద ప్రజలు పడుతున్నటువంటి కష్టాలు, బాధలు, ఎదుర్కొంటున్న దౌర్జన్యాలు, అకృత్యాలను వివరించారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మకూరు : ఆత్మకూరు మండలం, తలుపూరు పంచాయతీలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మంత్రి పరిటాల సునీత పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను, అరాచకాలను వివరించారు. ఆత్మకూరు మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. నాయకులు ఇంటింటికీ వెళ్లి టిడిపి ప్రభుత్వ హయాంలో నిత్యావసర సరుకుల ధరలు, జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పెరిగిన ధరలను పోల్చి చూసుకోవాలని మహిళలకు తెలియజేశారు. ప్రస్తుతం పెరిగిన నిత్యావసరాల ధరలు, పెంచిన ఛార్జీలను ప్రజలకు వివరించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించగల శక్తియుక్తులు ఉన్న ఏకైక నాయకుడు చంద్రబాబు నాయుడు మాత్రమే అన్నారు. వార్డుల్లో టిడిపి నాయకులు నిర్వహించిన ప్రచారానికి పెద్ద ఎత్తున ప్రజలు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నారాయణస్వామి, బొమ్మయ్య, అక్కులన్న, ప్రతాప్, బాబా, వెంకటనారాయణ, ఆనంద్, ఓబుళపతి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు మండలంలో పరిటాల సునీత ప్రచార ర్యాలీ

శింగనమల : తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు ఆధ్వర్యంలో శింగనమల గ్రామంలో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముంతా నరేష్, బండిపరశురాం, మెండం శివ యాదవ్, అబ్దుల్ జిలాని, వెంకటేష్, దాసరి గంగాధర్, ఎంపిటిసి కుళ్లాయప్ప, ఆదినారాయణ, కాయల సురేష్ యాదవ్, గడ్డం నారాయణ, రాజబాబు, గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి మసూద్ వలి, జడేజా, మెండం చిన్న ఎర్రిస్వామి, మాసుల్ సూర్య ప్రకాష్, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

నార్పల : చామలూరు గ్రామంలో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు అలం నరసానాయుడు, జిల్లా నాయకులు అలం వెంకట నరసానాయుడు ప్రారంభించారు. వైసిపి ప్రభుత్వం అరాచకాలు, అవినీతి గురించి గడప గడపకూ వెళ్లి తెలియజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్, సర్పంచులు, ఎంపిటీసీలు, మాజీ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుట్లూరు : మండలంలోని సూరేపల్లి గ్రామంలో శుక్రవారం ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను శుక్రవారం విడుదల చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సుదర్శన్ నాయుడు, నాయకులు రవిచంద్ర, మైనార్టీ నాయకులు దస్తగిరి, శివశంకర్‌రెడ్డి, ఆదినారాయణ రెడ్డి, రామాంజనేయులు, సదాశివ, నాగేశ్వరరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ప్రసాద్‌రెడ్డి, తీర్థమయ్య, కుల్లాయప్ప, నాగమయ్య, పి.కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పంచాయతీ సమావేశం

ప్రజాశక్తి -అనంతపురం

అనంతపురం రూరల్ మండలంలోని రుద్రంపేట పంచాయతీ సర్వసభ్య సమావేశం పోలీసుల పహారా మధ్య శుప్రశాంతంగా సాగింది. శుక్రవారం రుద్రంపేట పంచాయతీ కార్యాలయంలో సర్పంచు పద్మావతి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి నరసింహారెడ్డి, ఉప సర్పంచి నరేంద్రరెడ్డిలు హాజరయ్యారు. ప్రతి వార్డులోనూ రూ.5 లక్షలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కార్యదర్శి అజెండా పెట్టారు. దీనికి వార్డు సభ్యులు ఆమోదించారు. పంతులకాలనీ, విమలా ఫారూక్‌నగర్, మాయావతి కాలనీ, వికలాంగుల కొట్టాలు, రుద్రంపేటలోని పలుకాలనీల్లో అభివృద్ధి పనులపై చర్చించారు. సమస్యలను సమావేశం దృష్టికి వార్డు సభ్యులు తెచ్చారు. ఉప సర్పంచి నరేంద్రరెడ్డి మాట్లాడుతూ పంచాయతీలో సర్పంచు, వార్డు సభ్యులందరూ ఒక్కటేనని స్పష్టం చేశారు. రుద్రంపేట పంచాయతీని అభివృద్ధి చేయడమే తమ సంకల్పమని తెలిపారు. రుద్రంపేట పంచాయతీ అభివృద్ధి కోసం తాను దేనికైనా సిద్ధమని స్పష్టం చేశారు. కార్యదర్శి నరసింహారెడ్డి మాట్లాడుతూ సమావేశం సజావుగా జరిగేందుకు సహకరించిన వార్డు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, ఏ సమస్య అయినా తన దృష్టికి తెస్తే వార్డు సభ్యులతో కలిసి పరిష్కారానికి కృషి చేస్తానని తెలియజేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఉప సర్పంచి నరేంద్రరెడ్డి, పంచాయతీ కార్యదర్శి

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-నార్పల

ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నార్పల మండల కేంద్రం కొత్త బస్టాండు సమీపంలోని గ్యాస్ ఆఫీసు వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. బొందలవాడ గ్రామానికి చెందిన వెంకట్రాముడు కొద్ది కాలంగా నార్పలలో నివాసం ఉంటున్నాడు. అతని కుమారుడు సంజయ్ కుమార్ (27) హైదరాబాదులో బిటెక్ చదివి ఇంటి వద్దనే ఉంటున్నాడు. కొద్ది కాలంగా సంజయ్ కుమార్ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. మనస్తాపంతో శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం తోట వద్ద నుంచి తల్లిదండ్రులు ఇంటికి వచ్చి తలుపు తెరిచి చూడగా కుమారుడు ఉరేసుకుని విగతాజీవిగా ఉండడాన్ని చూసి విలపించారు. ఎస్ఐ వెంకటప్రసాద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఆత్మకూరు : రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొని ముగ్గురికి గాయాలైన సంఘటన ఆత్మకూరు మండల పరిధిలోని పంపనూరు గ్రామ సమీపంలో శక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీనివాసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడ్డ వారిని 108 సాయంతో ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం పట్టణానికి వినాయక ఉత్సవ సమితి అధ్యక్షుడు దబ్బడి మంజునాథ (43) గుండెపోటుతో శుక్రవారం మరణించారు. ఉదయం అల్పాహారం తీసుకున్న అనంతరం ఇంటి ముందు కుర్చీలో కూర్చుని ఉండగా అకస్మాత్తుగా కుప్పకూలాడు. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకువెళ్లగా గుండెపోటుతో ఆయన మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మంజునాథకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన కురిహినశెట్టి సామాజిక వర్గానికి చెందిన యువకుడు కాగా వినాయక ఉత్సవ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవారు. ఇటీవలే పట్టణ వినాయక ఉత్సవ సమితి అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఆయన మృతి పట్ల విప్ కాపు రామచంద్రారెడ్డి, ఉత్సవ కమిటీ ప్రతినిధులు సంతాపం తెలిపారు.

వాలంటీర్ తొలగింపు

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

మండల పరిధిలోని వెంకటంపల్లి గ్రామానికి చెందిన వాలంటీర్ ఆంజనేయులు నాయక్‌ను అవినీతి ఆరోపణలతో తొలగించినట్లు ఎంపీడీవో జాషువా విలేకరులకు శుక్రవారం తెలిపారు. ప్రభుత్వం అందించే అమ్మ ఒడి, పింఛన్, చేయూత తదితర పథకాలకు చెందిన నగదును ఈ-కేవైసీ పేరుతో వారి ఖాతా నుండి పెద్ద మొత్తంలో తీసుకున్నట్లు నిర్ధారించడంతో అతడిని తొలగించామన్నారు. ఇటువంటి పొరపాటు జరగకుండా మిగతా సచివాలయాల్లోని అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆంజనేయులు నాయక్ రూ.8 లక్షలకు పైగా అవినీతికి పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయకుండా వాలంటీర్‌ను విధుల నుంచి తొలగించి చేతులు దులుపుకున్నారన్న చర్చనడుస్తోంది.

హార్టికల్చర్ యూనివర్సిటీ బోర్డు సభ్యులుగా ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

ప్రజాశక్తి-శింగనమల

వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ బోర్డ్ సభ్యురాలుగా శింగనమల నియోజకవర్గ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి నియమితులయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జగనన్న ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు.

సచివాలయాల పరిశీలన

ప్రజాశక్తి-పుట్లూరు

మండల పరిధిలోని కడవకల్లు, కందికాపుల గ్రామ సచివాలయాలను డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఓబులమ్మ, ఎంపీడీవో యోగానందరెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందే విధంగా చూడాలని సిబ్బందికి సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషిచేస్తామని చెప్పారు. అనంతరం వారు అంగన్వాడీ సెంటర్లను సందర్శించారు. గర్భిణులకు, బాలింతలకు, పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కు పొందడం అందరి బాధ్యత

ప్రజాశక్తి-గుంతకల్లు

మాట్లాడుతున్న రెవెన్యూ డివిజన్ అధికారి

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు పొందడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి 18 ఏళ్లు నిండిన ప్రతి యువతా ఓటరుగా తమ పేరును నమోదు చేసుకోవాలని గుంతకల్లు రెవెన్యూ డివిజన్ అధికారి కె.రవీంద్ర అన్నారు. శుక్రవారం గుంతకల్లు పట్టణంలోని శ్రీసాయి మహిళా డిగ్రీ కళాశాల, శ్రీ శంకరానంద గిరి స్వామి డిగ్రీ కళాశాలల్లో వేరువేరుగా ఓటరు నమోదుపై విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజా ప్రతినిధులను ఎన్నికోవడంలో ఓటరు కీలకపాత్ర ఉంటుందన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ బాధ్యతగా ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్‌లో కానీ ఆఫ్ లైన్‌లో కానీ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, శ్రీసాయి మహిళా డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ జి.ప్రభాకర్, శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి బి.కృష్ణయ్య, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : 18 సంవత్సరాలు నిండిన యువకులు ఓటరు నమోదు చేసుకోవాలని తహశీల్దారు షర్మిల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటరు నమోదు కోసం శనివారం, ఆదివారం రెండు రోజులు ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఓటును ఒక పోలింగ్ కేంద్రం నుంచి మరో పోలింగ్ కేంద్రానికి మార్చుకునేందుకు కూడా అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వాలంటీర్ల పోస్టులకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-నార్పల

నార్పల మండలంలో ఖాళీగా ఉన్న ఆరు వాలంటీర్ల పోస్టులకు స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపీడీవో దివాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. బి.పప్పూరులో 3, నడిమిదొడ్డి గ్రామంలో ఒకటి, నార్పల మండల కేంద్రంలో రెండు వాలంటీర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి లక్ష్మీనరసింహ, మండల పరిషత్ సిబ్బంది నూర్ మహమ్మద్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ తనిఖీ

రాయదుర్గం రూరల్ : రాయదుర్గం పట్టణంలోని మార్కెట్ కమిటీ ఆవరణలో ఉన్న ఇంటిగ్రేటెడ్ అగ్రిల్యాబ్‌ను జెడిఎ చంద్రనాయక్ శుక్రవారం తనిఖీ చేశారు. మొలక శాతం పరీక్ష కోసం ఉంచిన మొక్కజొన్న, టమోటా, మిరప రకాల విత్తనాలను, ఎరువులకు సంబంధించిన నమూనాలను పరిశీలించారు. ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌కు వచ్చే విత్తన, ఎరువుల నమూనాలకు పరీక్షలు జరిపి వివరాలను తక్షణమే పంపించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు లక్ష్మానాయక్, మండల వ్యవసాయ అధికారి మహేంద్ర, విస్తరణ అధికారి వినోద్ తదితరులు పాల్గొన్నారు.